భోజన సమస్యను పరిష్కరించండి

- రోడ్డుపై ధర్నా చేసిన విద్యార్థులు
- గత ఏజెన్సీ నిర్వాహకులు వద్దంటూ నినాదాలు


బీబీపేటలో రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు

బీబీపేట: మధ్యాహ్న భోజనం సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలోని టీఎస్ఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. పాఠశాలలో గతంలో ఉన్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు వంటలు సరిగ్గా వండటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, కమిటీకి విన్నవించడంతో గత నెలలో కొత్త ఏజెన్సీ నిర్వాహకులను నియమించారు. దీంతో తాము ఏన్నో ఏళ్ల నుంచి వంటలు చేస్తున్నామని మాకు న్యాయం చేయాలని హైకోర్టు నుంచి ఆర్డర్ కాపీ తెచ్చుకున్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి ఎలాంటి షోకాజ్ నోటీసులు జారీ చేయకుండా ఏజెన్సీని రద్దు చేయడం విరుద్ధమని, జీవో–94 ప్రకారం తొలగించే అర్హత లేదని తక్షణమే విధుల్లో చేరి వంటలు చేయాలని ఆర్డర్ జారీ చేశారు. దీంతో సోమవారం నుంచి వంట చేయడానికి పాత ఏజెన్సీ వారు పాఠశాలకు రావడంతో విద్యార్థులు మాకు కొత్త వారే వంట చేయాలని ధర్నా నిర్వహించారు. పాత వారు వంట చేయడంతో సగానికి పైగా తినడం లేదని, ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తెచ్చుకుంటున్నామని వాపోయారు. పాఠశాల గేట్ వద్ద, ప్రధాన చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించి ప్లకార్డులు ప్రదర్శించారు. చివరికి విద్యార్థులకు నచ్చజెప్పి పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, చైర్మన్ స్రవంతి, హెచ్ఎం రవీంద్రారెడ్డిలు మాట్లాడుతూ.. పాత ఏజెన్సీ వారు వంట చేస్తారని, 15 రోజులు చూసిన తర్వాత వంట బాగా చేయకుంటే తుది నిర్ణయం తీసుకుంటామని విద్యార్థులకు సూచించారు. దీంతో విద్యార్థులు సద్దుమణిగారు.

బ్యాంకులో ఏజెంట్లదే హవా

- యూనియన్ బ్యాంక్ తెరవకముందే వాలుతున్న దళారులు
- రైతులు తీసుకున్న రుణం రెన్యువల్ చేయాలంటే రూ.లక్షకు రూ.3 వేల కమీషన్ వసూలు
- మేనేజర్లు మారినా మార్పురాని వైనం
- దళారులు చెప్పిందే పాటిస్తున్న బ్యాంక్ సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న సామాన్య ఖాతాదారులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్ మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ దళారులకు అడ్డాగా మారింది. రైతులు తీసుకున్న పంట రుణం రెన్యువల్ చేయడానికి రైతుల చేతుల్లో సమయానికి డబ్బులు అందకపోవడంతో తప్పని పరిస్థితిలో దళారులను ఆశ్రయిస్తున్నారు. రైతులు నుంచి దళారులు రూ.లక్షకు రూ.3 వేలు వసూలు చేస్తుండటంపై కొంత మంది రైతులు దళారులపై తిరగబడ్డ సందర్భాలున్నాయి. బ్యాంక్ తెరవక ముందే దళారులు బ్యాంక్ వద్ద వాలుతున్నారు. గతంలో ఇదే పరిస్థితి ఉండడంతో రీజినల్ కార్యాలయం నుంచి అధికారులు స్పందించి విచారణ చేపట్టి బ్యాంక్‌లో పని చేస్తున్న ఓ అధికారిని, బ్యాంక్ మేనేజర్‌ను సైతం బదిలీ చేశారు. అయినా ఇప్పటికి ఎలాంటి మార్పు రాలేదు. బ్యాంక్ అధికారుల కనుసన్నల్లోనే ఈ వ్యవహారం జరుగుతోందని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది రైతులు దళారులకు కమీషన్ కింద రూ.3 వేలు ఇవ్వలేక నేరుగా బ్యాంక్ అధికారులను సంప్రదిస్తే పనులు కావడం లేదని వారు వాపోతున్నారు. నేరుగా బ్యాంక్‌కు వెళ్లిన ఖాతాదారుడికే న్యాయం జరగకుంటే ఇంకా ఎవరికి న్యాయం చేస్తారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు బ్యాంక్ వద్ద రుణాల రెన్యువల్ కోసం రూ.లక్షల్లో టర్నోవర్ జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి దళారీ వ్యవస్థను అరికట్టాలని పలువురు ఖాతాదారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

మండల ప్రత్యేక అధికారిగా శ్రీపతి



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ మండల ప్రత్యేక అధికారిగా పిల్లి శ్రీపతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మండల ప్రత్యేక అధికారిగా పనిచేసిన తిరుమల కామారెడ్డి మండల ప్రత్యేక అధికారిగా వెళ్లారు. ఆయన స్థానంలో జిల్లా మత్స్యశాఖ ఏడీగా పనిచేస్తున్న శ్రీపతిని నిజాంసాగర్ మండల ప్రత్యేక అధికారిగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఎర్రాపహాడ్ రైతు వేదిక కార్యాలయం వద్ద కొనసాగుతున్న సోయా కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఏడీఏ రత్న తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలలో అన్ని రకాల సదుపాయాలను కల్పించాలన్నారు. ఆమె వెంట ఏవో నర్సింలు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా విశ్వవిద్యాలయం విద్యార్థులు అనిత, తిరుమల, ప్రణీత, యశ్విత, శాంతి ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ఎల్లారెడ్డిరూరల్: తిమ్మాపూర్‌లో సీసీ రోడ్డు పనులను మాజీ జెడ్పీటీసీ ఉషాగౌడ్ సోమవారం ప్రారంభించారు. గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్డు పనులు నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రవీందర్, శ్రీనివాస్ తదితరులున్నారు

కంటి వైద్య శిబిరం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 122 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణుడు హరికృష్ణారావు, వైద్యుడు మారుతి బాబు, ప్రధానోపాధ్యాయుడు యోసెఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

రాంపూర్‌లో పశువైద్య శిబిరం

పిట్లం(జుక్కల్): రాంపూర్‌లో పశు గణన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశు గణన అభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి మజీద్ హైమద్ మాట్లాడుతూ.. చలి కాలంలో పశువులు ఎదకు వస్తాయని, సకాలంలో గుర్తించి అందుబాటులో ఉన్న గోపాల మిత్ర ద్వారా కృత్రిమ గర్భధారణ చేయించినట్లయితే మంచి మేలు జాతి దూడలు పుడతాయన్నారు. ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పశువైద్యాధికారి సంతోష్, సూపర్‌వైజర్ తిరుపతి, గోపాల మిత్రలు సంగమేశ్వర్, అంజని కుమార్, ప్రసాద్, రైతులు పాల్గొన్నారు

పశువుల గణన ప్రారంభం

పిట్లం(జుక్కల్): 21వ జాతీయ పశుగణనలో భాగంగా మండలంలోని రాంపూర్‌లో సోమవారం పశువుల గణనను మండల పశువైద్యాధికారి సంతోష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. జంతు జనాభా, ఆ ప్రాంతంలో లభ్యమయ్యే జాతుల రకాలు, పశువుల పెంపకందారులు, తదితర వివరాలను అంచనా వేయడం పశువుల గణన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మండలంలోని రైతులందరూ పశు గణన సిబ్బందికి సహకరించి మీ జంతువుల కచ్చితమైన గణాంకాలను అందించాలని కోరారు.

ప్రారంభమైన సత్యసాయి జయంతి వేడుకలు



కామారెడ్డి అర్బన్: స్థానిక అయ్యప్పనగర్‌లోని శ్రీసత్యసాయిబాబా ఆలయంలో సోమవారం సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. వేడుకలను శనివారం వరకు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి తెలిపింది.

దళారులకు అమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు


సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దకొడప్‌గల్(జుక్కల్): దళారులకు సోయా అమ్మి మోసపోవద్దని జుక్కల్ ఎమ్మెలల్యే తోట లక్ష్మీకాంతారావు రైతులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని సొసైటీలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. సోయా క్వింటాలుకు రూ.4,892 ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందని తెలిపారు. అనంతరం సొసైటీ కార్యదర్శి సందీప్ మాట్లాడుతూ.. తేమ 12 శాతానికి మించకుండా ఉండాలన్నారు. ఏఈవో సర్టిఫికెట్, పట్టా పాస్ బుక్, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు తీసుకురావాలని సూచించారు. సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, శామప్ప పటేల్, మల్లప్ప పటేల్, తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌రెడ్డిని విమర్శిస్తే ఊరేకునేది లేదు



ఎల్లారెడ్డి: కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదని జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం సుభాష్‌రెడ్డి నివాసంలో ఆయన మాట్లాడారు. సుభాష్‌రెడ్డి వర్గానికి చెందిన రామారెడ్డి మండలానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తపై ఎమ్మెల్యే అనుచరులు రాత్రివేళ బెదిరింపులకు పాల్పడడంతో పాటు, ఆయనకు సంబంధించిన చెరుకు తోటను దగ్ధం చేసిన విషయమై సుభాష్‌రెడ్డి మాట్లాడితే దానికి ఎమ్మెల్యే అనుచరులు సుభాష్ రెడ్డిని విమర్శించడం తగదన్నారు. దీనిని ఇలాగే కొనసాగిస్తే ఊరుకునేది లేదన్నారు. నాయకులు కాశీరాం, నిజాం, బాలకిషన్ తదితరులున్నారు.

పేదల సమస్యలు పరిష్కరించాలి



కామారెడ్డి క్రైం: 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ధర్మ సమాజ్ పార్టీ డిమాండ్ చేసింది. ఆ పార్టీ జిల్లా ప్రతినిధులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి రెవెన్యూ అదనపు కలెక్టర్ వి. విక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం, ఉపాధి, అర్హులైన వారందరికీ సాగునీటి సౌకర్యం ఉన్న ఎకరం భూమి, పేదలకు 200 వందల గజాలతో నాలుగు గదుల ఇల్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కన్వీనర్ బోలెశ్వర్, కో కన్వీనర్ అరవింద్, ప్రధాన కార్యదర్శి పర్శురాములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రయివేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో బోధన జరుగుతోందని సీనియర్ అధ్యాపకుడు సంతోష్ అన్నారు. తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో అనుభవం ఉన్న అధ్యాపకులున్నారని, కళాశాలలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయన్నారు. ప్రణాళిక, క్రమశిక్షణతో చదివి రాబోయే వార్షిక పరీక్షలలో మంచి ర్యాంకులు సాధించాలన్నారు. ఈ సందర్భంగా తలిదండ్రుల సలహాలు, సూచనలను తీసుకున్నారు.

ఘనంగా శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన



గాంధారి(ఎల్లారెడ్డి): తిప్పారం గ్రామంలో సోమవారం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆర్యక్షత్రియ తెలంగాణ అధ్యక్షుడు హారాశే తానాజీ రావు చేతుల మీదుగ ఘనంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యక్షత్రియ సామాజిక వర్గం ఉన్న ప్రతి గ్రామంలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాజేశ్వర్ రావు, ముకుంద్ రావు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. ఆదివారం నాటికి 16 వేల 642 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును క్రషింగ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

మృతి చెందిన విద్యార్థిని కుటుంబానికి ఆర్థిక సాయం



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని భవాని అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుటుంబానికి పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం రూ.10వేల100 ఆర్థిక సహాయం అందించారు. అనంతరం బాలిక మృతికి సంతాపం తెలుపుతూ ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని వినతి



బాన్సువాడ: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి వికలాంగుల హక్కుల సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల సమితి జిల్లా ఉపాధ్యక్షుడు దారం రాములు మాట్లాడుతూ.. దివ్యాంగులకు సర్టిఫికెట్ల కోసం ప్రతి నెల సదరం శిబిరం నిర్వహించాలని, పింఛన్ రూ.6 వేలు, అంత్యోదయ కార్డులు ఇవ్వాలని కోరారు. పరికరాలు అందించాలని, ఆర్టీసీలో ఉచిత బస్ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు సాయిలు, గౌరవ అధ్యక్షుడు కిష్టయ్య, కార్యదర్శి గంగాధర్, తదితరులున్నారు.

మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలి



బాన్సువాడ/బాన్సువాడరూరల్: హైదరాబాద్‌లో వచ్చే నెల 1న నిర్వహించే మాలల సింహగర్జన మహాసభలను విజయవంతం చేయాలని మాల మహానాడు నేతలు బంగారు మైశయ్య, నర్రె నర్సింలు కోరారు. సోమవారం బాన్సువాడలో వారు మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు గైని రవి, మన్నె చిన్న సాయిలు, మన్నె నాగభూషణం, తదితరులున్నారు.

కుటుంబ సర్వేపై అపోహలు వద్దు


ఎన్యుమరేటర్‌కు వివరాలు తెలుపుతున్న చంద్రకాంత్‌రెడ్డి


విద్యార్థులు వేసిన చిత్రాలను పరిశీలిస్తూ..

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి

భిక్కనూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై అపోహలు పెట్టుకోవద్దని గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ద చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం రామేశ్వర్‌పల్లిలో సర్వే గురించి తన ఇంటికి వచ్చిన ఎన్యుమరేటర్‌కు ఆయన కుటుంబ వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు ఈ సర్వేపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది తగదన్నారు. ప్రతి కుటుంబం సర్వే వివరాలను తెలిపితే ప్రభుత్వ పరంగా మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. మాజీ సర్పంచ్ మద్ది శ్యామల ఉన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

కామారెడ్డి అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి విద్యార్థులతో మాట్లాడారు. తీరిక సమయాల్లో బొమ్మలు వేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 150 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం సాయిలు

- ఐకేపీ ఏపీఎం సాయిలు

రాజంపేట: మహిళా సంఘ సభ్యులు ఆర్థికంగా బలోపేతం కావాలని ఐకేపీ ఏపీఎం సాయిలు అన్నారు. సోమవారం రాజంపేట మండల కేంద్రంలో మండల మహిళా సంఘ భవనంలో నిర్వహించిన మహిళా శక్తి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సంవత్సర కాలంలో సాధించిన ప్రగతి గురించి సంఘ సభ్యులతో చర్చించారు. మహిళా సంఘాల ద్వారా అందిస్తున్న ఆర్థిక వనరులను సంఘం సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న మండల సమాఖ్య అధ్యక్షులు శాంత

మహిళలను సంఘాలలో చేర్పించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాలలో అర్హులైన మహిళలను సంఘాలలో చేర్పించాలని నాగిరెడ్డిపేట మండల సమాఖ్య అధ్యక్షులు బేస్త శాంత సూచించారు. తెలంగాణ సంబరాలలో భాగంగా నాగిరెడ్డిపేట మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహిళా సంఘాలలో చేరిన సభ్యులు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలకు బీమా సదుపాయం ఉంటుందన్నారు. సమావేశంలో ఏపీఎం జగదీశ్ కుమార్, కోశాధికారి మున్నెమ్మ, అకౌటెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకం యూనిట్ ప్రారంభం


యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఐకేపీ అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రభుత్వం అమలుచేస్తున్న మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మాల్తుమ్మెదలో గ్రామ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పెరటి కోళ్ల పెంపకం మదర్ యూనిట్‌ను ఐకేపీ అధికారులు ప్రారంభించారు. మండలంలోని మహిళా సంఘాల సభ్యులు మహిళా శక్తి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం జగదీశ్ సూచించారు. సీసీ దత్తు, లబ్ధిదారురాలు చాకలి లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

బోనస్ విడుదలపై రైతుల హర్షం

బాన్సువాడ రూరల్: సన్న రకం వడ్లకు తెలంగాణ ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ విడుదల చేయడంపై మండలంలోని బోర్లం గ్రామానికి చెందిన రైతులు హర్షం వ్యక్తం చేశారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు నెర్రె నర్సింలు, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, మంద శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న బోర్లం రైతులు

రైతు పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

బిచ్కుంద(జుక్కల్): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని, సీఎం రేవంత్‌రెడ్డి వడ్లకు బోనస్ ఇచ్చి ఆదుకున్నారని పీసీసీ డెలిగేట్ విఠల్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం రూ.500 బోనస్ డబ్బులు రైతు ఖాతాలో జమచేయడంతో సోమవారం కాంగ్రెస్ నాయకులు, రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు గోపాల్‌రెడ్డి, ధర్పల్ గంగాధర్, రవీందర్ పటేల్, నౌషా నాయక్, వెంకట్‌రెడ్డి, మెక్కా మసూద్, రైతులు పాల్గొన్నారు.


బిచ్కుందలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

సంక్షిప్తం

కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని సింగిల్ విండో చైర్మన్, డీసీఎంఎస్ డైరెక్టర్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం కాలోజివాడి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. దళారులకు అమ్మి మోస పోవద్దన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): పలు గ్రామాలలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, షౌకత్‌అలీ, శివాజీ, అఖిల్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపల్లిలో..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): లింగంపల్లిలో పలువురికి సోమవారం గ్రామ కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస గ్రామ అధ్యక్షుడు గణేశ్, ప్రధాన కార్యదర్శి ఉషయ్య, మహిళా కమిటీ అధ్యక్షులు మంజుల, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను తప్పుదోవ పట్టించొద్దు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి తప్పుదోవ పట్టిస్తే పుట్టగతులుండవని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఇక నుంచైనా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుపై ఆరోపణలు మానుకోవాలని హితవుపలికారు.

గ్రూప్–4లో ఉద్యోగం.. అభినందనలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన భీమ్మన్నగారి సంజీవ రెడ్డి కుమార్తె సుస్మిత గ్రూప్–4లో ఉద్యోగం సాధించినందుకు సోమవారం గ్రామ పెద్దలు సన్మానం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నర్సిములు, సుధాకర్, యాదగిరి, సంజీవరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్యదర్శి శివాజీతండావాసులకు సూచించారు. సోమవారం మండలంలోని కుబ్యానయక్ తండాలో ఉన్న మురికి కాలువలను పంచాయతీ సిబ్బందితో కార్యదర్శి పరిశుభ్రం చేయించారు.